

ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ మేళా

వనస్థలిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్ కొండపల్లి టాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధం గా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

ఆర్టీసీ కార్మికులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి

హయత్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హయత్‌నగర్ బస్ డిపో ఎదుట సీఐటీయూ, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసి రిటైర్‌మెంట్ అయిన ఆర్టీసీ కార్మికులకు పెన్షన్ ఇవ్వకపోవడం దారుణం అన్నారు. ఈపీఎస్ పద్ధతిలో వచ్చే వెయ్యి రూపాయలు దేనికి సరిపోతుందని ప్రశ్నించారు. ఒక్కసారి ప్రభుత్వం, ఆర్టీసీ ఆలోచించి విశ్రాంత కార్మికులకు నెలకు పదివేల పెన్షన్ వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 24వేల మంది కార్మికులు రిటైర్ అయి ఉన్నారని తెలిపారు. అయ్యర్ పెన్షన్ కోసం రికవరీ చేసి రిజక్టు చేసిన 1,637 మందికి రావాల్సిన డబ్బులకు చక్రవడ్డీతో సహా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఆస్పత్రి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు టీజేయం రెడ్డి, దానయ్య, నారాయణ, జనార్దన్, జయరాం, సామేల్, సౌరయ్య, రాజ్యం, కార్మికులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

కొత్తపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో వరదనీటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. శుక్రవారం ఆయన జెడ్సీని కలిసి తరచూ వర్షాల వేళ వరద సమస్యలు తలెత్తే ప్రాంతాలనూ, గురువారం నాటి అకాల వర్షానికి ఆయా ప్రాంతాల్లో రహదారుల దుస్థితిని వివరించారు. వరదనీటితో కొట్టుకొచ్చిన ఇసుక, మట్టి దారులపైకి చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మట్టిని, ఇసుకను తొలగించడానికి బాబ్‌క్యాట్ లేదా ఎక్స్‌కవేటర్ సదుపాయం కల్పించాలని కోరారు. డివిజన్ పరిధిలో వరద ముంపు సమస్య దూరం చేసేందుకు చేపట్టే బాక్స్‌డ్రెయిన్ పనుల కోసం రూ.3 కోట్లు మంజూరు చేశారని, వర్షాకాలం మొదలయ్యేలోగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కాలనీల్లో పాడైన అంతర్గత రహదారులకు వెంటనే మరమతు పనులు చేపట్టాలని జెడ్సీకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం జెడ్సీ సమస్యలు ఉన్న డివిజన్ కాలనీల్లో పర్యటిస్తారని కార్పొరేటర్ తెలిపారు.



జెడ్సీకి వరదనీటి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



కాలనీవాసుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

షార్ట్ సర్క్యూట్లపై అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలనీవాసులు షార్ట్‌సర్క్యూట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్లో షార్ట్ సర్క్యూట్‌తో సీసీ కెమెరాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్ భూలక్ష్మీనగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించి కాలనీవాసుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలు అధిక మొత్తంలో విద్యుత్ వినియోగిస్తారని, అందుకు తగిన విధంగా విద్యుత్ అధికారులు షార్ట్ సర్క్యూట్ ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కాలనీవాసులు విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాశీపతి, ప్రధాన కార్యదర్శి రవికిరణ్ పొనుగుపాటి, ఉపాధ్యక్షులు శ్రీధర్, దామోదర్ రెడ్డి, గంగాధర్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఈనెల 6న ఉదయం 10గంటలకు నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరతూ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి శుక్రవారం ఆలయ ఈవో ఎస్.లావణ్య ఆహ్వానపత్రికను అందజేశారు. ఆలయ పండితులు, అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ వేదపండితులు ముత్యాలశర్మ, అర్చకులు కందాళ సంతోషకుమార్, సిబ్బంది వెంకటయ్య, మాజీ ధర్మకర్త మధుసాగర్ పాల్గొన్నారు.

ప్రమాదకర షెడ్డుల్లో వ్యాపారాలు నిర్వహించొద్దు



రైతులతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ శ్రీనివాస్

సైదాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో కూలిపోయేందుకు సిద్ధంగా ప్రమాదకరమైన షెడ్డులలో రైతులు అమ్మకాలు నిర్వహించవద్దని హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తెలిపారు. వర్షం కారణంగా మాదన్నపేట మార్కెట్ ఆవరణలో ఏర్పడిన పరిస్థితిని శుక్రవారం ఆయన పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న షెడ్డు కూలితే బాధ్య త ఎవరూ వహిస్తారని మార్కెటింగ్ అధికారులను ప్రశ్నించారు. యుద్ధప్రాతి పదికన కొత్త షెడ్డులు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చా రు. త్వరలోనే పాలకవర్గం సమావేశంలో చర్చించి మార్కెట్ పారిశుధ్యం, డ్రైనేజీ పైప్‌లైన్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారులు స్వప్న, మల్లికార్జున్, హరీష్, వ్యాపార ప్రతినిధులు హన్మంత్‌రెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.



కవాడిపల్లిలోని కోదండ రామచంద్రస్వామి ఆలయం



కోదండ రామచంద్రస్వామి ఆలయ గాలి గోపురం



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని ధ్యానాంజనేయస్వామి ప్రధాన ఆలయం



కర్మన్‌ఘాట్‌లోని కోదండ రామాలయంలో నిత్య పూజలందుకుంటున్న సీతారామచంద్రస్వామి

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు

- రేపు కవాడిపల్లిలో కోదండ రామచంద్రస్వామి కల్యాణం
- వేడుకలకు సర్వం సిద్ధం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి: మండలంలోని కవాడిపల్లిలోని చారిత్రక కోదండ రామచంద్రస్వామి ఆలయం స్వామివారి కల్యాణ రథోత్సవాలకు సర్వం సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లాలోని చారిత్రక ఆలయాల్లో ఒకటిగా పేరుగాంచిన చరిత్ర కోదండ రామచంద్రస్వామి ఆలయానికి ఉంది. ఈ ఆలయానికి నాలుగు శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్నట్లు గ్రామ పెద్దలు చెబుతుంటారు. గ్రామానికి తూర్పు వైపున ఎత్తైన గుట్టపై ఓ పెద్ద బండరాయికి మధ్యలో సీతారాములు స్వయంబూగా వెలిసినట్లు చరిత్ర చెబుతుంది. ఆ కాలం నుంచి ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాలను గ్రామస్థులు ఎంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ప్రతి ఏటా భద్రాచలంలో జరిగే భద్రాద్రి రాముడి కల్యాణ ముహూర్త సమయానికే ఇక్కడ కూడా కోదండ రామచంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. వారం రోజుల పాటు ఈ ఉత్సవాలను గ్రామస్థులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఉత్తర ముఖ ద్వారం కలిగి ఉన్న ఈ ఆలయం సీతారాములను దర్శించుకుంటే కోరిన కోరికలు ఫలిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హైదరాబాద్‌కు కేవలం 20కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం భక్తులకు కొంగుబంగారంలా.. నిత్యపూజలతో విరాజిల్లుతోంది. స్వామి వారి కల్యాణ, రథోత్సవాలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి శ్రీరామ భక్తులు వేలాదిగా తరలివచ్చి వారి మొక్కులు తీర్చుకుంటారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

చైత్రశుద్ధ నవమి ఏప్రిల్ 6న కోదండ రామచంద్రస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సర్వం సిద్ధం చేసింది. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శనివారం ఉదయం కోదండ రామచంద్రస్వామిని పెళ్లి కుమారుడిగా, అదే రోజు సాయంత్రం సీతమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించనున్నారు. ఆదివారం స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భద్రాచలంలో భద్రాద్రిరామయ్య కల్యాణం జరిగే సమయానికే ఇక్కడ కూడా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆనాటి నుంచి వస్తున్న ఆచారంలో భాగంగా భక్తుల సౌకర్యార్థం అదే రోజు రాత్రి 7గంటలకు కల్యాణ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వేలాది మంది రామభక్తుల సమక్షంలో అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన కోదండ రామచంద్రస్వామి కల్యాణం కనులపండువగా జరుగుతుంది. ఏప్రిల్ 7న రాత్రి 10గంటల నుంచి స్వామివారి రథోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. రథోత్సవం సందర్భంగా ఆర్కేస్ట్రాతో పాటు విద్యార్థులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా లంకాదహనం

సీతారాముల కల్యాణం మరుసటి రోజు ఏప్రిల్ 7న రథోత్సవం ఘనంగా జరుగుతుంది. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ ఏర్పాటు చేసిన రావణ లంకాదహనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయానికి సమీపంలో రావణలంకతో పాటు భారీ రావణాసురుడి ప్రతిమను ఏర్పాటు చేస్తారు. రథంపై సీతారామచంద్రస్వామి లంక వరకు వెళ్లి లంకాదహనం చేయడం.. భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఈ లంకాదహన వేడుకను కన్నులారా వీక్షిస్తారు. అనంతరం స్వామివారు సమీపంలోని ఓ బావివద్దకు వెళ్లి స్నానం ఆచరించి తిరిగి వచ్చి భక్తులకు దర్శనమిస్తారు.

కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో..

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఈనెల 6న నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దేవస్థానంలోని ధ్యానాంజనేయస్వామి, కోదండ రామాలయంలో నిత్య పూజలందుకుంటున్న సీతారామచంద్రస్వామి వార్లకు 6న ఉదయం 4గంటలకు సుప్రభాతం, 4:30గంటలకు స్వామి వారికి అభిషేకం, 7గంటలకు ప్రత్యేక అలంకరణలు, అర్చనలు, 8గంటలకు విష్ణుసహస్ర పారాయణములు, 9గంటలకు ఎదుర్కోలు, 10గంటలకు మండప ప్రవేశం, సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం 1గంటకు తీర్థప్రసాద వినియోగం, 4గంటల నుంచి ఆలయంలో అర్చనలు, 5గంటల నుంచి ధ్యానాంజనేయస్వామి వారి భక్త బృందం చేత భజనలు, 6గంటలకు స్వామి వారి రథోత్సవం, రాత్రి 8గంటలకు స్వామి వారికి నీరాజనం మంత్రపుష్పం, తీర్థప్రసాదముల వినియోగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎస్.లావణ్య తెలిపారు. ధ్యానాంజనేయస్వామి దర్శనం కోసం విచ్చేసే వేలాది మంది భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, తాగు నీటి వసతి, చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీతారాముల కల్యాణం వీక్షించేందుకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. సీతారాముల కల్యాణం చేయించుకునే భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

ఉప్పరిగూడ రామాలయంలో..

సైదాబాద్ : చావునీ ఉప్పరిగూడ రామాలయంలో ఆదివారం నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో కల్యాణోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలు ఏప్రిల్ 21 వరకు 16 రోజుల పాటు కొనసాగుతాయని వివరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రాజుయాదవ్, ప్రతినిధులు సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్, యాట ప్రమోద్, రాహుల్ కిషోర్, ప్రవీణ్, రాజ్‌పాల్ పాల్గొన్నారు.



ధర్మనిలయంలోని పందిరిలో మరమరాల దండలు

ధర్మనిలయంలో మరమరాల పందిరిలో..

సైదాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ఏపీఏయూ కాలనీలోని ఈ ఇంటి పేరు ధర్మనిలయం. ఆ ఇంట్లో ఓ పెద్దావిడ అనసూయమ్మ 40 సంవత్సరాలుగా మరమరాలు, వేరుసెనగలతో తీర్చిదిద్దిన పందిరిలో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాలు ఉగాది రోజున ప్రారంభమై నవమి రోజు కల్యాణంతో ముగుస్తాయి. ఉత్సవాలలో రామకోటి జపం, విష్ణుసహస్రనామాలు, నగర సంకీర్తన, భజనలు, హోమా లు, నిత్యాన్నదానం కొనసాగిస్తారు.

60కిలోల మరమరాలు, 40కిలోల వేరుశెనగలు..

మాఘశుద్ధ పంచమి రోజున గ్రామదేవతకు చలిమిడి, పాలతో అభిషేకించి పందిరి పనులకు శ్రీకారం చుడతారు. మరమరాల ముత్యాల పందిరి అలంకరణను ఉగాది రోజున ప్రారంభిస్తారు. సుమారు 40మంది మహిళలు రోజు దారాలకు మరమరాలు ఎక్కిస్తారు. 60 కిలోల మరమరాలు, 40 కిలోల వేరుశెనగలను అలంకరణకు వినియోగిస్తారు. రామనా మ జపం చేస్తూ మహిళలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ అల్లికలను సా గిస్తారు. రామ జపానికి మూలం మర అనే భావనతో సీతారాముల కల్యాణానికి మరమరాల ఏర్పాటు చేశారు. పదకొండు మరమరాల చొప్పున త యారు చేసే దండలో ఓ పల్లీగింజ(వేరుశెనగ) చేరుస్తారు. సీతాదేవి భూగర్భంలో అవతరించిందనే పౌరాణిక గాథను అనుసరించి భూమి నుంచి వచ్చే వేరుశెనగకు మరమరాల దండల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారు.

ఉనికిని కాపాడుకోవడానికే టూరిస్టు రాజకీయాలు

- మధుయాష్కీ తీరుపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పక్కన మాజీ కార్పొరేటర్లు

ఎల్బీనగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆరు నెలలు అమెరికాలో ఆరు నెలలు భారత్‌లో ఉంటూ కాంగ్రెస్ పార్టీలో తన ఉనికిని కాపాడుకునేందుకు రాజకీయాలు చేయడం మధుయాష్కీకి పరిపాటిగా మారిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కీ తీరును సుధీర్‌రెడ్డి ఎండగట్టారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల చీకటి పొత్తుతోనే ప్రోటోకాల్ రగడ సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. మధుయాష్కీ అవగాహన లేమితో బీజేపీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులను తప్పుదోవపట్టించి రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. సంవత్సర కాలంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించకుండా అటు అధికారులను, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని తప్పుదోవపట్టించే విధంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మధుయాష్కీ వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఎన్నడూ లేని విధంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ని విమర్శిస్తున్నారన్నారు. కనీస అవగాహన లేకుండా బీజేపీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడవస్థానంలో నిలిపి ప్రజలు బుద్ధి చెప్పినా మధుయాష్కీ చిల్లర రాజకీయాలు మానుకోవడం లేదని మండిపడ్డారు. మధుయాష్కీ తనపై వ్యక్తిగత దూషణలకు దిగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలలో హుందాతనం చాలా అవసరమన్నారు. రెండుసార్లు ఎంపీగా పనిచేసిన వ్యక్తి ఈ విధంగా ప్రవర్తించడం తగునా అని అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నదని కావునా తానేమి మాట్లాడనని ఆయన చెప్పారు. కోర్టుతీర్పు అనంతరం ఆ అంశంపై మాట్లాడుతానన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్, సాగర్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, పద్మ శ్రీనివాస్‌నాయక్, బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డి డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎన్యూమరేటర్లు, రిసోర్స్‌పర్సన్స్

కులగణన ఎన్యూమరేటర్ల ఆందోళన

ఎల్బీనగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తమతో కులగణన సర్వే చేయించి డబ్బులు ఇవ్వడంలేదని ఎన్యూమరేటర్లు, రిసోర్స్‌పర్సన్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎన్యూమరేటర్లు, రీసోర్స్‌పర్సన్లు సరూర్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల సముదాయం ఎదుట ఆందోళన చేపట్టారు. కులగణన సర్వేచేసి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం తమకు ఇస్తామన్న డబ్బులు ఇవ్వలేదన్నారు. అధికారులను అడిగితే రేపు, మాపు అంటూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. కులగణన సర్వేలో గృహిణులు, పొదుపు సంఘాల మహిళలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని సర్వేలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ఇస్తామన్న రూ. 10వేలు ఇవ్వలేదన్నారు. కేవలం కొందరికి మాత్రమే డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఇంకా 90శాతం మందికి పైగా డబ్బులు ఖాతాలలో జమ చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేసి తమకు డబ్బులు చెల్లించాలని వారు కోరారు.

జిల్లాలో పార్టీ పటిష్టతకు పాటుపడాలి : బూర నర్సయ్యగౌడ్



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మన్సూరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి అర్బన్ జిల్లాలో ఏ ఎన్నిక వచ్చినా బీజేపీ అభ్యర్థులు సునాయసంగా గెలిచేలా జిల్లాలో పార్టీ మరింతగా పటిష్టం కావాలని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బూర నర్సయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అరాచకానికి పాల్పడుతోందని, ఈ అరాచకంపై త్వరలో రాష్ట్ర పార్టీ చేపట్టబోయే చలో హెచ్‌సీయూకి రంగారెడ్డి అర్బన్ జిల్లా నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. బీజేపీ తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు బిల్లుతో పేద ముస్లింలకు ఎంతో న్యాయం చేకూరుతుందన్నారు. వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ పదవుల్లో, టికెట్ల పంపకాల్లో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా నిబద్ధతతో పనిచేస్తూ బీజేపీ పటిష్టతకు జిల్లాలో ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, బీజేపీ జాతీయ నాయకుడు పేరాల చంద్రశేఖర్‌రావు, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, కళ్లెం బాల్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, జోర్రిగల శ్రీకాంత్, కొత్త రవీందర్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, బండారి భాస్కర్, రాంరెడ్డి, శ్రీనివాస్‌నాయుడు, గీతారెడ్డి, బొల్లం యశ్పాల్‌గౌడ్, గంగాధర్‌రెడ్డి, శివసింగ్, అనిల్‌గౌడ్, రాధాకృష్ణయాదవ్, జంగారెడ్డి, నీరంకి రవి, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతనాయక్ పాల్గొన్నారు.

కబ్జాలకు గురౌతున్న ప్రభుత్వ భూములను రక్షించండి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కబ్జాలకు గురౌతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని సీపీఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని సర్వే నంబర్ 26,73,127లోని ప్రభుత్వ భూమిని కొందరు రాజకీయ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా చెరువు కుంటలను సైతం వదలడం లేదన్నారు. వీటన్నింటిపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, ముత్యాలు, శ్రీను, శ్రీశైలం, ప్రణయ్ పాల్గొన్నారు.

లక్ష్మీనగర్ కాలనీలో కుంగిన రోడ్డు

సైదాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీ ప్రధాన రహదారిపై మట్టి కూరుకుపోయి రోడ్డు కుంగడంతో గురువారం రాత్రి నుంచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల వేసిన బాక్స్‌డ్రెయిన్ కాలువ నిర్మాణం పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో రోడ్డు కుంగింది. దీంతో కాలనీవాసులు అప్రమత్తమై రోడ్డుపై రాకపోకలను నిలిపివేశారు. వెంటనే కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అధికారులకు తెలియజేశారు. జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష స్పందించి సదరు కాంట్రాక్టర్‌చే మరమ్మతు పనులు చేయించారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

- 7వ తేదీ వరకు కొనసాగనున్న వేడుకలు



విద్యుత్ దీపాల వెలుగులో నాదర్‌గుల్ హనుమాన్ ఆలయం

సరూర్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ మిడిల్ వార్డులో(సాయిబాబా ఆలయం పక్కన) గల అభయాంజనేయస్వామి ఆలయం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకలను గురువారం ప్రారంభించారు. నాదర్‌గుల్ గ్రామంలో ఎంతో పురాతన ఆలయంగా పేరున్న ఈ దేవాలయం పునఃనిర్మాణం పనులు చేపట్టి గర్భగుడిని ఆధునికంగా తీర్చిదిద్దారు. ఆలయంలో ఏడాది క్రితం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయం పునఃప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం నుంచి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యారాధన, బాలభోగ నివేదన, శాత ముర్రై, స్వామి వారి పాదుకల షోడశోపచార పూజ, శ్రీరామ సహస్రనామార్చన, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, హోమం, నీరాజనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు స్వామి వారి ఎదుర్కోలు..

ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7గంటలకు సీతారాముల ఎదుర్కోలు నిర్వహించి, ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం పాదుకా పట్టాభిషేకం నిర్వహించి, ఆశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలను ముగించనున్నట్టు వారు పేర్కొన్నారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

వరదలో కొట్టుకువచ్చిన వ్యర్థాల తొలగింపు



సాయినగర్‌లో వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గురువారం కురిసిన భారీ వర్షం కారణంగా మలక్‌పేట రైల్వేబ్రిడ్జి కింద రోడ్డులో వరద తాకిడికి కొట్టుకువచ్చిన వ్యర్థాల తొలగింపునకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఇంజనీరింగ్ అధికారులు, హెచ్‌ఆర్‌డీసీ అధికారుల సమన్వయంతో శుక్రవారం చర్యలు చేపట్టారు.

మూసారాంబాగ్ సాయినగర్‌లో..

మూసారాంబాగ్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతమైన సాయినగర్‌కాలనీలోకి కొట్టుకువచ్చిన వ్యర్థాల తొలగింపుకు శుక్రవారం చర్యలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి పనులను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, శానిటేషన్ సూపర్‌వైజర్ సుభాష్, కాలనీవాసులు వినోద్, సురేందర్, రాం శ్రీవాత్సవ్, ఉమేష్ కార్పొరేటర్ వెంట ఉన్నారు.